



# ఎంపిక

**'హైటెక్' అభివృద్ధి పేరుతో ప్రభుత్వం నడుపుతున్న ప్రజా స్కీములు, రోజుకో రకంగా మారుతున్న 'పాలసీ'లు పేదోళ్ళకు నిజంగా ఒరగబెడుతున్నదేమిటి? మారుతున్న ఉత్తరాంధ్ర ముఖచిత్రంలో మారని ఓ బడుగు రైతు వెత - ఈ కథ**

శంభాన పారయ్య- చాలా సేపట్నించీ నిల్చున్నాడు చేతులు కట్టుకుని- ఫీల్డాఫీసర్ వైపు ఆశగా చూస్తున్నాడు. వేసవి పోయి ఆషాఢం రోజులు. సాయంత్రం నాలుగ్గంటల వేళ. బ్యాంకులో రద్దీ లేదు. క్యాష్ కౌంటరు మూసేసి ఉంది. మేనేజర్ రూములో ఫోన్ ఎంగేజిలో ఉంది. ఫీల్డాఫీసర్ గదిలోమాత్రం పాలేం కర్నమూ, పోలిపేట దళిత నాయకుడు దమ్మలయ్యా కూర్చుని ఉన్నారు.

ఫీల్డాఫీసర్ ఏదో ఫైల్ చూసి చూసి, "మీ విలేజి క్లస్టర్ గ్రూప్‌లో కలిపేరయ్యా ఈసారి" అని చెప్పాడు శంభాన పారయ్యకు.

బోధపడలేదు, అయోమయంగా చూశాడు పారయ్య.

"ఈసారి సబ్సిడీ స్కీమ్సు మీ ఊరికే ఇవ్వాలి. నీకు తప్పకుండా ఈ సారి స్కీము శాంక్షనవుతుంది" అన్నాడు ఫీల్డాఫీసర్.

పారయ్యకు అర్థమైంది. అయినా, మూడు ఎన్నికల నుంచీ ఒకే వాగ్దానం చేస్తున్న రాజకీయ నాయకుణ్ణి చూసినట్లు ఫీల్డాఫీసర్ని అనుమానంగా చూస్తూ -

"మూడేళ్ళ నుంచీ ఆ ఆశతోటే తిరుగుతన్నాను. పెడతామంటే ఆశ, కొడతామంటే భయమూ గాదేటి? ఈ యేడాది మరి తమ దయ" అన్నాడు పారయ్య.

"మూడో యేడాదీ గడిచిపోతే - మీరు బదిలీ అయిపోతారు. మళ్ళ కొత్తాఫీసరొస్తే - కొత్తగ మళ్ళ కత ఆరంబించాల." దమ్మలయ్య ఇదే అదనని ఫీల్డాఫీసర్ మీద విసురు విసిరాడు.

"ఆఫీసర్లు మారిపోతే ఏం? ఫైళ్ళు మారవుగదా? మీరు మూడేళ్ళు కాదు, ముప్పయ్యేళ్ళు తిరిగినా పాత బాకీలుండగా కొత్త స్కీంలివ్వమయ్యా" అన్నాడు ఫీల్డాఫీసర్.

"నేను పాత బాకీలేటి ఉంచలేదు బాబ్." చెప్పాడు పారయ్య.

"నువ్వు గాదు, ఇదిగో ఇతనూ" అని దమ్మలయ్యను చూపి, "మీ ఎస్సీల్లో ఒక్కళు పాత లోన్స్ తీర్చినోళ్ళున్నారా? మళ్ళీ కొత్తవిచ్చియాలా?" దమ్మలయ్యను ప్రశ్నించాడు ఫీల్డాఫీసర్.

"కట్టగలిగిన స్తోమతుంటే కట్టరా?"

"స్తోమతు లేనపుడు వాడడమెందుకూ?"

"స్తోమతున్నోళు మాత్రం కట్టేస్తన్నరేటి? ఆళు పెద్దోళ్ళు. ఆళ్ళనేటన్లేరు. ఎస్సీలనేసరికి యెవరికయినా అలుసు."

ఇద్దరూ వాదించుకోసాగారు. శంభాన పారయ్య ఈ వాదన్లతో తన పని చెడిపోతుందేమోనని భయపడసాగాడు. దమ్మలయ్య తగ్గితే బాగుణ్ణని, అతని వైపు వారిస్తున్నట్లుగా చూడసాగాడు. ఈలోగా పాలేం కర్నం కల్పించుకున్నాడు.

"పెద్దోళ్ళు ఏంటి, చిన్నోళ్ళేంటి? బ్యాంకుకి ఎవరయినా ఒకటే. చూసి చూసి కోర్టులో పడేస్తారు. అప్పుడు పెద్దా లేదు, చిన్నా లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని లెక్చరిచ్చాడు.

దమ్మలయ్య ఆ తర్వాత మరి వాదించలేదు. కూర్చున్న బెంచీ మీంచి లేచి వెళ్ళిపోయేందుకు బయల్దేరి, "అయితే, మరి బేంకుకి రావొద్దంటారు" అనడిగాడు.

"ఒద్దనెలగంటాడూ పాత బాకీలుండగా? కొత్త అప్పుల కోసం రావొద్దంటాడు గానీ." మళ్ళీ కర్నమే ఫీల్డాఫీసర్‌కి బదులుగా జవాబిచ్చాడు.

"మరి పేదోళ్ళు బతకొద్దన్నమాట." ఇద్దరినీ ఉద్దేశించి పలికి నిరసనగా అక్కడ నించి వెళ్ళిపోయాడు దమ్మలయ్య.

"అయితే బావూ, ఎప్పుడు రమ్మంతారు" అడిగాడు పారయ్య.

ఆ ప్రశ్నకు ఎక్కడలేని నవ్వూ వచ్చింది ఫీల్డాఫీసర్‌కి. నవ్వి నవ్వీ కళ్ళు తుడుచుకొని, "అమాయకుడా, ఇంకా బోలెడు వ్యవహారముంది. క్లస్టర్ గ్రూపులో మీ ఊరు చేర్చబడింది. ఇక మీ ఊరిలో ఎవరికి ఏ స్కీము ఇవ్వాలో అది మళ్ళీ వేరేగా సెలక్టు చేస్తారు. నీ కవన్నీ తెలీవుగానీ, ముందు 'ఫారం-టూ' రాయించుకో వి.డి.ఓగారితో." చెప్పాడు ఫీల్డాఫీసర్.

"మూడు రాయించేను బాబ్." చెప్పాడు పారయ్య.

"మూడు ఎందుకయ్యా?"

"సంవచ్చరాని కొకటి, మూడు సంవచ్చరాలు రాయించేను. రాసిన స్కీము రానీ, రాకపోనీ ఫారం కర్సు పడెయ్యరా అంటాడు వి.డి.ఓ. వి.డి.ఓ, ఎం.డి.ఓ అందరి కాళ్ళూ పట్టుకున్నాను. పాలు కోసం రాళ్ళు మోసేను, ఆఫీసులు ఎక్కిదిగేను."

మూడేళ్ళ నుంచీ బండి, పశువుల ఋణం కోసం పడిన యాతనలు ఏకరవుపెట్టసాగాడు పారయ్య.

పారయ్యకు తన కడుపు సొద చెప్పుకోవడమంటే చాలా ఇష్టం. అవతలి వ్యక్తి వింటాడా, వినడా అని పరిశీలించడు. మనుషుల్తోనే కాదు, పొలంలో గట్టు మీద కూర్చొని తనతో తానే చెప్పుకొంటాడు. తోలుకువెళ్ళే పశువుల్తో, తొక్కే ఏతాముతో చెప్పుకొంటాడు.

పారయ్యకు ఈ అలవాటు పద్నాలుగేళ్ళ వయసులో అంటింది. పారయ్య అప్పుడు తండ్రితో పాటు పొలానికి వెళ్ళేవాడు. వీరికి గల పొలం అంతా ఎకరా బాడువా భూమి. నాగావళీనది ఒడ్డు. ఒండ్రుమట్టితో నిండిన సారమైన తీరభూమి.

అందులో కందమూలం, తేగదుంపలూ, సొత్తుకూర దుంపలూ, ఉల్లీ, వంగ, ఆనప, బెండలాంటి కూరగాయ పంటలు పండించేవారు.

ఆ ఊరిలోనే వారానికి ఒక రోజు సంత జరిగేది. ఆ సంతలో కూరగాయల్ని అమ్ముకొని జీవించేవారు.

"నెల జీతగాడి కంటె మీరే అదృష్టమంతుల్రా. వారమయ్యేసరికి రూపాయిలు గలగల లాడిస్తన్నా"నే వారు ఊరి ప్రజలు తండ్రీ కొడుకుల్తో.

నిజంగానే పారయ్య తండ్రి కాలంలో తిండీతిప్పలకు లోటు జరుగలేదు. పారయ్య చదువూ, సామూ అనకుండా తండ్రి వెనకాలే తిరిగేవాడు. ఏతాం ఎక్కి తొక్కేవాడు. నీరు నిండిన గూనను పారయ్య తండ్రి అందుకొని పాయలుగట్టిన మళ్ళవైపు పోయే దోనెలో ఒంపుతూ పద్యాలూ, పాటలూ పాడేవాడు. పారయ్య వంతపాడేవాడు. తండ్రి తీసే రకరకాల రాగాలను లోలోపల పునశ్చరణ చేసుకునే వాడు. ఒంటరిగా పద్యం చదువు కొనేవాడు. పద్యాలూ, పాటలూ, పొలంలో పాటు పడడమూ ఇష్టమయిన వ్యాపకాలయినాయి పారయ్యకు బాల్యం నుంచే. పొలం గట్టు మీద కూర్చొని చద్దన్నాన్ని అప్పుడే మడిలోంచి కాడల్తో సహా తీసిన ఉల్లిపాయను నంచుకు తినడమంటే ఎంతో ఇష్టం పారయ్యకు.

"నవరుచుల వొంటలూ నాకేల?
నాతల్లి ఉల్లీ... నా ఇంట నుండ" అని పాడుకొనేవాడు ఆనందంగా.

తండ్రీకొడుకులు అన్ని విషయాలూ కలబోసుకొనేవారు. పారయ్య పెళ్ళీడుకొచ్చాడు. మేనరికం సంబంధం చేసుకొన్నాడు. మరో రెండేళ్ళకి తోబుట్టువు పెళ్ళి జరిపించాడు. తోబుట్టువు పెళ్ళికి అప్పుజేస్తే గాని జరగలేదు. ఆ అప్పు ఉంటుండగా పారయ్య తండ్రి వల్లకాటికి చేరుకొన్నాడు.

కలిసి పదాలు పాడుతూ, కబుర్లు కలబోసుకొంటూ, కలిసి శ్రమించే తండ్రి మరణించాక పారయ్యకు శ్రోతా, వక్తా జమిలిగా కరువయ్యేరు. ఇకప్పటి నుంచీ పశువుల్తోనూ, ఏతాం మొక్కతోనూ, ఎవరూ లేని నాగావళి నదితోనూ కబుర్లు చెప్పుకొనేవాడు. శ్రోతా, వక్తా తానే అయ్యేవాడు.

ఫీల్డాఫీసర్ విసిగిపోయాడు.

"కబుర్లాపవయ్యా" అని కసురుకొని, ఏదో గుర్తొచ్చి, "అవునూ, నీకు రేషన్ కార్డుందా" అనడిగాడు.

"ఉంది బాబ్." చెప్పాడు పారయ్య.

"పచ్చ కార్డా, పసుపు కార్డా?"

"రంగెలిసి పోయింది బాబ్." తల గోక్కుంటూ, అమాయకంగా చెప్పాడు పారయ్య.

"అది కాదయ్యా. బియ్యం కార్డా, గోధుమలా?"

"గోధుమలు మాకేల బాబ్? మామేటి మీలాగ ఆఫీసర్లమా? పొట్టలు పెరిగాయని గోధుమ రొట్టెలు తిండానికి."

ఆ జవాబుకు కోపగించిన ఫీల్డాఫీసర్, "అనవసర వాగుడు వల్లే నీకు పనవడం లేదయ్యా" అన్నాడు.

"చిత్తం." అంగీక

> **పారయ్యకు తన కడుపు సొద చెప్పుకోవడమంటే చాలా ఇష్టం. పొలంలో గట్టు మీద కూర్చొని తనతోనే కాక తోలుకు వెళ్ళే పశువుల్తో, తొక్కే ఏతాముతో కూడా చెప్పుకొంటాడు.**

చిత్రాలు: నర్సిం



రించాడు పారయ్య.

"రేషన్ కార్డ్ జిరాక్స్ తీయించు. అవునూ, పాత బాకీ తీర్చేశానన్నావు గదా. ఎన్నాళ్ళయ్యింది" అనడిగాడు ఫీల్డాఫీసర్.

పారయ్య తన తండ్రి కాలంలో బ్యాంకు రుణం తీసుకోలేదు. అప్పట్లో ఈ బ్యాంకు లేదు. అప్పూ సప్పూ సంతకొచ్చే షావుకారిచ్చేవాడు. ఇచ్చిన అప్పు అసలు ఉండిపోయేది. ఫాయిదాలే తీరేవి. అందుకని 'షావుకారి అప్పు-ఫలసాయంకి ముప్పు' అని గ్రహించిన పారయ్య తన పెద్దరికానికొచ్చేసరికి షావుకారి అసలు కూడా తీర్చేశాడు. మరి అప్పు తీసుకోలేదు. భార్యా, తానూ కలిసి శ్రమజేసి, కూరగాయల పంటల్తో రోజులు గడిపేవాడు. తండ్రి మరణించాక, చెల్లెలి పెళ్ళి సందర్భంలో మాత్రం పారయ్య మళ్ళీ షావుకారి అప్పు వాడక తప్పింది కాదు. కూరగాయల ఫలసాయం ఫాయిదా కిందనే పోయేది. తనలాగే గ్రామంలో చాలామంది మునిగిపోయారు. కొత్త కొత్త మార్పులు ఊళ్ళో చోటు చేసుకొన్నాయి. రాళ్ళు తేలిపోయి, పిడకలు మునిగి పోయినట్లయింది. రైతులూ, వృత్తులు నమ్మినోళ్ళూ చెడిపోయారు. అడివినీ, పట్నాన్నీ కలిపి నాల్లేసే వ్యాపార్లు, కాంట్రాక్టర్లు, సారా వండినోళ్ళు, సంతల్లో జూదాలు నడిపినోళ్ళూ బాగుపడ్డారు. దానికితోడు కొత్తగా గ్రామీణ బ్యాంకు వచ్చింది. కొత్త కొత్త స్కీముల్తోటి భూముల్లో బోర్లూ, మోటార్లూ; సాలల్లోకి ట్రాక్టర్లూ వచ్చాయి. అప్పటిదాక నీటికి ఆకాశాన్ని చూసే పొలాల్లో పాతాళగంగ పారసాగింది. వీటికి తోడు కృష్ణా జిల్లా నుంచి నలుగురు దొరలు దిగారు. ఊరిలో మెట్ట భూములుగా, రైతులకు శిరోభారంగా మిగిలిన పెద్దపెద్ద మెరకభూముల్ని చౌక ధరలకు కొనేశారు. ఆ భూముల్ని బుల్‌డోజర్లతో నొల్లించి, గట్లు పోయించి, బోర్‌లు తవ్వించి, మోటార్లు పెట్టి, మెట్ల భూముల్ని పల్లపు భూములు చేసి, భూముల్లో అరటి, పసుపు, సూర్యకాంతం, మిరప లాంటి వ్యాపార పంటల్తో పాటు క్యాబేజి, వంగ, టమాటో, చిక్కుడు లాంటి రకరకాల హైబ్రిడ్ కూరగాయ పంటల్ని పండించసాగారు.

అంతకు ముందు- సంత రోజు పార్వతీపురం, రాయగడ ప్రాంతాల నుంచి వ్యాపార్లు వచ్చేవారు. పారయ్య లాంటి చిన్న రైతుల కూరగాయల పంటలకు మంచి గిరాకీ ఉండేది. ఇప్పుడు వ్యాపార్లు రావడం లేదు. వాళ్ళ గోదాములకు తమ వ్యానుతో కూరగాయ పంటల్ని పంపించసాగారు కొత్త దొరలు. దాంతో పారయ్య కూరగాయలు సంతలో పుచ్చిపోయేవి. కొత్త దొరలకు కమిషన్ ఎక్కువిచ్చి అమ్ముకోవలసి వచ్చేది. అప్పూ, వడ్డీ గూడా మూలిగేది.

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు మరుసటి ఏడాది వరదొచ్చి పారయ్య బాడువను ముంచేసింది. ఏతాం మొక్క నదిలో కలిసిపోయింది. నది తన పొలం మీదుగా ప్రవహించసాగింది. అప్పుడు వరద ముంపుకు భూములు కోల్పోయిన పేదలకు కొత్త మెరక బంజరు భూమిని పంపకం చేశారు ఎమ్మెల్యే. ఆ బంజరు బాగు కోసం బ్యాంకులో రుణాల్నీ ఇప్పించారు. అదిగో, అప్పుడు బ్యాంకులో రుణం వాడుకున్నాడు. బంజరు భూమిని వరకట్టి, సాగులోకి తెచ్చాడు. ఆ భూమిలో ఫలసాయంతో అప్పు తీర్చేశాడు మూడేళ్ళ కిందట. అప్పట్నించీ బండి, పశువుల రుణం కోసం తిరుగుతున్నాడు.

ఫీల్డాఫీసర్ ఫైలు మూసేస్తూ, "సరేగానీ, ఈ ఏడాదికి సంబంధించిన స్కీముల లిస్టు మండలాఫీసులో తయారవుతాయి. మీ వి.డి.ఓని పట్టుకొని ముందు 'ఫారం-టూ' రాయించు. వెళ్ళు" అని పారయ్యకు చెప్పాడు.

పారయ్య అక్కడి నుంచి నేరుగా వి.డి.ఓ ఇంటికి వెళ్ళాడు. సాయంత్రం పొద్దు గూటిలో పడేవేళ. వి.డి.ఓ వీధి అరుగు మీద తల దిండు వేసుకొని చేరబడి ఉన్నాడు. ఎవరో అయిదారుగురు గడపలో ఆయనకు దగ్గరగా కూర్చున్నారు.

దండాలు పెట్టి నిల్చున్నాడు పారయ్య.

"ఏం బాబూ పారయ్య నాయుడూ. యేటి

శలవు" అని హాస్యంగా పలకరించాడు వి.డి.ఓ.

ఆయనకన్నీ హాస్యస్ఫోరకాలే. ఎవరయినా బస్సు మిస్సయినా, జేబులోంచి డబ్బు పోగొట్టుకొన్నా, ఏదేనా నష్టపోయినా విరగబడి నవ్వుతూ పలకరిస్తాడు. ఆయన మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయబోతున్నాడు. అప్పుడు నవ్వుతూ పలకరించాలని చాలామంది ఎదురు చూస్తున్నారు.

వి.డి.ఓ పలకరింపుకు పారయ్య తల గోక్కుంటూ, "ఫారం - టూ" అన్నాడు.



"నువ్వడిగినపుడల్లా రాయడానికి నీ గుమస్తానేట్రా నీను?"

"అదేం మాట బావ్? తమకేటి గవినేర్లు." పారయ్య చేతులు జోడించి చెప్పాడు.

"మరి లేపోతే యేట్రా? వేళా పాళా, ఆఫీసూ, ఇల్లూ అని చూడవా? పడుకునీ కాడకీ ఒచ్చేసి ఫారం టూ అనడిగేస్తవేట్రా?"

ఆ ప్రశ్నకు గడపలో కూర్చున్నవాళ్ళు గొల్లున నవ్వారు. వి.డి.ఓ ఆశించిందే అది.

పారయ్య చిన్నబోయి, "మీకు వలపలా, దావలా అన్లేం. పెద్దోళు. తమ దయ" అని మళ్ళీ దండం పెట్టాడు.

వి.డి.ఓ అక్కడికి సంతృప్తిపడి, "రేపు జన్మభూమి కార్యక్రమం. స్కూలు దగ్గరకి రా. అక్కడ శ్రమదానం చెయ్యాల. అక్కడికి నోడల్ ఆఫీసరూ, మండలాధికారీ, మండల ప్రెసిడెంటూ అందరూ వస్తారు. ఎమ్మెల్యే గూడ వస్తారట. శ్రమదాన కార్యక్రమం అయిపోతే, అక్కడ స్కీముల లిస్టు తయారుజేస్తారు. ఆ తర్వాతే లిస్టుబట్టి ఫారం టూ రాస్తాను. రేపు రా" అని చెప్పాడు.

గడపలో కూర్చున్న వారు వి.డి.ఓ వద్ద సెలవు తీసుకొని లేచి వెళ్ళిపోయారు.


> "మన వ్యవసాయం, పల్లెలూ ఆధునికం కావాలని హైటెక్నాలజీని దింపారు. మోటార్లు, ఆయిలింజన్లు, ట్రాక్టర్లు తప్ప ఈసారి బండెడ్ల స్కీము లేదు. నీ పేరు లిస్టులో లేదు" అన్నాడు ఫీల్డాఫీసర్.

వి.డి.ఓ లేచిపోయి పారయ్యకు సెలవిచ్చేరు.

* * *

మర్నాడు పారయ్య- జన్మభూమి కార్యక్రమంలో- పారాపలుగూ పట్టి శ్రమదానం చేశాడు. మండలంలో రైతులెందరో చెమటలు చిందించారు. మండలాధ్యక్షుడూ, ఎమ్మెల్యే, పారయ్య ఊరి కొత్త దొరలూ, మరికొంతమంది పెద్దలూ శ్రమదాన పోజుల్తో ఫోటోలు దిగారు.

ఆనంతరం జరిగిన సభలో సబ్సిడీ స్కీములకు లబ్ధిదార్లను ఎంపిక చేశాం అనీ, బ్యాంకులకు లిస్టులు పంపిస్తామనీ, స్కీముల్తో లబ్ధి పొంది అభివృద్ధి చెందండనీ ఎమ్మెల్యే, ఎం.పి ప్రకటించారు.



పారయ్య మర్నాడు బ్యాంకుకు వెళ్ళాడు. బ్యాంక్ ఆ రోజు తెరవలేదు. ప్రైవేట్ లోకల్ బ్యాంకుల ఏర్పాటును ప్రతిపాదించిన ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా సమ్మె జరిపారట.

మర్నాడు బ్యాంకుకు వెళ్తే ఫీల్డాఫీసర్ లేరు. మేనేజర్ ఒక్కరే ఉన్నారు. చాలా సేపు ఆయన ఫోనులోనే మాట్లాడారు. పారయ్యతో మాట్లాడనే లేదు. పారయ్య చేతులు జోడించి నిల్చునే ఉన్నాడు.

చివరికి ఫోన్ పెట్టేశాక పారయ్య దండాల్ని అందుకున్నాక, విషయం విన్నాక బ్యాంకులో రెండు యూనియన్లు ఉన్నాయనీ, వాటిలో ఒకటి మేనేజ్‌మెంట్ చేపట్టిన బదలీలు నచ్చక స్ట్రయిక్ చేస్తున్నాయనీ, ఫీల్డాఫీసర్ అందుకని రారనీ చెప్పారు.

పారయ్య గుండె లెందుకో గబగబా కొట్టుకొన్నాయి. స్కీముల లిస్టు గురించి అడిగాడు. మేనేజర్ తెలీదన్నారు. అప్పుడే గుర్తుకు వచ్చినట్లు అనిపించి పారయ్య, "బావూ, బదిలీలంతన్నావు గదా, మన ఫీలాఫీసరిగ్గాని బదిలీ ఉంతాదేటి కొంప దీసి" అనడిగాడు మేనేజర్ని.

ఆయన ఆ రోజు వార్తాపత్రికలో షేర్ మార్కెట్‌లో కళ్ళు దూర్చి చిద్విలాసంగా చూసి

చూసి, ఆ తర్వాత పారయ్య వైపు చూస్తూ, "ఆ విషయం బదలీలు చేసే మా పర్సనల్ మేనేజరే చెప్పలేదు. బలాబలాలు తేలాల. రెండు యూనియన్లూ ఇప్పుడు బలపరీక్షలో ఉన్నాయి" అన్నాడు.

పారయ్యకు బోధపడలేదు. మళ్ళీ ప్రశ్నా తలెత్తలేదు. "అయితే, రేపొస్తాను బావ్" అని చెప్పి వచ్చేశాడు.

మర్నాడు వెళ్ళేసరికి ఫీల్డాఫీసర్ ఉన్నాడు. ఏదో లిస్టు చూస్తున్నాడు. పారయ్య దండాలు పెట్టాడు. ఫీల్డాఫీసర్ లిస్టు మీంచి పారయ్య వైపు చూసి, " శంభాన పారయ్య గదా నీ పేరు" అనడిగాడు.

పారయ్య, 'సత్యమే పలికినారు ప్రభూ' అన్నట్లుగా తలూపాడు.

"బండి, ఎడ్ల స్కీముకు గదా దరఖాస్తు" అనడిగాడు.

'పరమ సత్యం పలికితిరి మహరాజా' అన్నట్లుగా ఆనందంగా తలూపేడు.

"అయితే లేదయ్యా" అన్నాడు ఫీల్డాఫీసర్. లిస్టు మూసేశాడు. పారయ్యకు చెవుల్లోంచి వేడిగాలి పరుగెత్తింది. ఆందోళనగా, "యేం బావ్, ఎందుకు లేదు" అనడిగాడు.

"ఈసారి పాలసీ మారిందయ్యా. మన వ్యవసాయ విధానం, మన పల్లెలూ అన్నీ ఆధునికం కావాలట. హైటెక్నాలజీని వ్యవసాయంలోకి దింపి, అభివృద్ధి చెయ్యాలట. అందుకు సంబంధించిన స్కీములనే శాంక్షన్ చేశారు. మోటార్లు, ఆయిలింజన్లు, ట్రాక్టర్లూ ఇస్తారయ్యా. ఈసారి బండెడ్ల స్కీము లేదు. నీ పేరు లిస్టులో లేదు" అన్నాడు.

ఆయన చెప్పిన చివరి మాట మాత్రమే అర్థమైంది. దాంతో కడుపు మండిన ఆక్రోశంతో, 'తొలి రోజు మా దమ్మలయ్య అన్నదే నిజమన్నమాట. మరి పేదోళ్ళు బతకొద్దన్నమాట.' ఇంకా ఏవేవో గొంతు దాటి రాలేని ప్రశ్నల్తో పారయ్య. ■